సాక్షి
అనంతపురం

బుధవారం । 8 । నవంబర్ । 2023



మరో మూడు రోజులు వర్షాలు

జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
$35.2^{\circ}/21.7^{\circ}$

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

భూనిర్వాసితులకు పరిహారం మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: హంద్రీ–నీవా కెనాల్ ద్వారా 9వేల ఎకరాలకు నీరిచ్చేందుకు రాకెట్ల నుంచి ఆమిద్యాల వరకు నిర్మించతలపెట్టిన లిఫ్ట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం రాకెట్ల గ్రామ సచివాలయంలో రాకెట్ల, సొల్లాపురం, ఆమిద్యాల గ్రామాల భూ నిర్వాసిత రైతులు కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) 52వ ప్యాకేజీలో భాగంగా లిఫ్ట్ నిర్మాణానికి 68 ఎకరాల భూమిని రైతులు కోల్పోయారని తెలిపారు. ఇందుకు పరిహారంగా ఎకరాకు రూ.12లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రూ.8.5 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. త్వరలోనే నిర్వాసిత రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో హంద్రీ–నీవా డీఈ లక్ష్మీదేవి, ఏఈ చామంతి కుమారి, ల్యాండ్ అక్విజేషన్ డీటీ అరుణ, సర్వేయర్ కోటేశ్వరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న పాల్గొన్నారు.

పలు పరీక్షల వాయిదా



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో పలు పరీక్షలను వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి తెలిపారు. బంద్ కారణంగా ఈ నెల ఎనిమిదో తేదీన ఫార్మా డీ (పీబీ) ఒకటో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు, ఫార్మా డీ ఒకటో సంవత్సరం (ఆర్–17) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఫార్మా డీ ఒకటో సంవత్సరం (ఆర్–14) సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేశామన్నారు. ఈ పరీక్షలను తిరిగి 14, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా దీపావళి పండుగ సెలవు కారణంగా ఈ నెల 13న జరగాల్సిన పరీక్షలను 15, 20 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫార్మా డీ ఒకటో సంవత్సరం రెగ్యులర్ సప్లిమెంటరీ, ఫార్మా డీ ఒకటో సంవత్సరం (ఆర్–17) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఫార్మా డీ ఒకటో సంవత్సరం (ఆర్–14) సప్లిమెంటరీ పరీక్షలను 15, 20 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. తాజా షెడ్యూల్‌ను అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు గమనించాలని సూచించారు.

ఎస్కేయూ పరిధిలోనూ వాయిదా

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో ఈ నెల 8న జరగాల్సిన ఐదేళ్ల లా కోర్సు తొమ్మిది, నాలుగో సెమిస్టర్ పరీక్షలు బంద్ కారణంగా వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నేటి పరీక్షలను 18న నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఈ నెల 13న జరగాల్సిన పరీక్ష 20వ తేదీ నిర్వహిస్తామన్నారు.

అక్రమంగా టపాసులు విక్రయిస్తే చర్యలు



ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: టపాసులు అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. లైసెన్సుదారులు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. దీపావళిని పురస్కరించుకుని టపాసుల విక్రయాల నిబంధనలపై ఎస్పీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాశ్వత/ తాత్కాలిక లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే టపాసులు అమ్మాలన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలి. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలి. ఆ పరిసరాల్లో ఏమి చేయాలో... ఏమి చేయకూడదో తగు సూచనలు చేస్తూ బోర్డులను ప్రదర్శించాలి. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా... అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్ – 100 లేదా సబంధిత పోలీసు స్టేషన్‌కు గానీ, తన నంబర్ 9440796800కు గానీ తెలపాలన్నారు.

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

దిశ ఎస్ఓఎస్ యాప్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల పోలీసులు దిశ ఎస్ఓఎస్ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్లు చేయించేందుకు శ్రీకారం చుట్టారు.



పుట్టపర్తి బహిరంగ సభలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

జగన్ తరంగం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పులకించిన పుట్టపర్తి
- లక్ష మంది వచ్చినట్లు అధికారుల అంచనా
- 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' నిధుల విడుదల
- బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేసిన సీఎం వైఎస్ జగన్
- పుట్టపర్తి నియోజకవర్గ రోడ్ల మరమ్మతులకు రూ.35 కోట్లు మంజూరు

దారులన్నీ కలిసిపోగా అడుగు..అడుగు ఏకమైంది. అభిమానం జనసంద్రంలా మారింది. జన తరంగం ఉవ్వెత్తున ఎగిసిపడగా పుట్టపర్తి పోటెత్తింది. ఉదయమే చిరుజల్లులతో స్వాగతం పలికిన వరుణుడూ అచ్చెరువుతో అలా చూస్తూ ఉండిపోగా.. జగన్నినాదం మార్మోగింది. వైఎస్సార్ సీపీ జెండా సగర్వంగా ఎగరగా, కార్యకర్త గుండె గర్వంతో ఉప్పొంగింది. జననేతను చూశామన్న సంతోషంతో జన జాతర సాగింది.

సాక్షి, పుట్టపర్తి

'జనమే జగన్.. జనంతోనే జగన్' అంటూ భారీ జనాలతో పుట్టపర్తి పులకించింది. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి రావడంతో భారీ జనాలు తరలివచ్చారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు జనం కిక్కిరిసిపోయారు. శ్రీసత్యసాయి విమానాశ్రయం నుంచి బహిరంగ సభ నిర్వహించిన క్రికెట్ మైదానం వరకూ అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించి జననేతపై అభిమానం చూపారు. బహిరంగ సభ నిర్వహించిన క్రికెట్ మైదానం నిండిపోగా, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద నుంచి వై–జంక్షన్ మీదుగా సభావేదిక అవతలి వైపు ఉన్న పరేడ్ మైదానం వరకు రోడ్డుపైనే జనం నిలబడ్డారు. అధికారులు, పోలీసుల అంచనా ప్రకారం దాదాపు లక్ష మంది వచ్చినట్లు చెబుతున్నారు.

నాడు స్కాములు...నేడు స్కీములు

'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వై–జంక్షన్ సమీపంలోని క్రికెట్ మైదానంలో పండుగలా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు చేసిన మేలు గురించి సీఎం వైఎస్ జగన్ వివరించారు. గత ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ గ్రిడ్, మద్యం కుంభకోణం, ఇసుక దోపిడీ, రాజధాని భూములు లాక్కోవడం తదితర కుంభకోణాలు చేశారని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి.. రైతులకు వెన్నెముకలా నిలుస్తోందని చెప్పారు. 'చంద్రబాబు హయాంలో స్కాములు చూశారు. మీ బిడ్డ జగన్ ప్రభుత్వంలో స్కీములు చూస్తున్నారు' అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదలకు బటన్ నొక్కారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణద్వివేది, వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ఉద్యాన శాఖ సలహాదారుడు టి.ప్రసాద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వైవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ సూచన మేరకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవ్‌రెడ్డి నేతృత్వంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ తదితరులు

జననేతకు ఘన స్వాగతం

సీఎం హోదాలో తొలిసారిగా పుట్టపర్తికి విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీసత్యసాయి విమానాశ్రయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్, కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీలు మంగమ్మ, రామచంద్రారెడ్డి, వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నారాయణ, డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, అనంత వెంకటరామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ సలహాదారు (విద్యాశాఖ) ఆలూరి సాంబశివారెడ్డి, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాశ్‌బాబు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.హరీశ్‌కుమార్‌యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, అహుడా చైర్మన్ మహలక్ష్మి శ్రీనివాస్, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ లిఖిత, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, కార్యకర్తలు తదితరులు స్వాగతం పలికారు.

వైఎస్సార్ రైతు భరోసా ఐదో ఏడాది రెండో విడత

రాష్ట్ర వ్యాప్తంగా 53.53 లక్షల మందికి రూ.2,204.77 కోట్ల లబ్ధి

అనంతపురం జిల్లాలో 2.94 లక్షల మంది రైతులకు రూ.120.17 కోట్ల లబ్ధి

రోడ్లకు రూ.35 కోట్లు మంజూరు

'పుట్టపర్తి నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ నాసిరకంగా వేయడంతో దెబ్బ తిన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 31 రోడ్లు మరమ్మతులకు గురై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నుంచి రూ.35 కోట్లు మంజూరు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది' అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సభలో సీఎంకు విన్నవించారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సభలోనే ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా 'జై జగన్' నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈలలు, కేకలతో హోరెత్తింది. జగన్ చెప్పాడంటే... చేస్తాడంతే అంటూ జనం ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం పర్యటన సాగిందిలా..

- ఉదయం 10.34 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకున్నారు.
- 10.47 గంటలకు విమానాశ్రయం నుంచి సభాస్థలికి బయలుదేరారు.
- 11.15 గంటలకు ప్రత్యేక బస్సులో సభావేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.20 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు.
- 11.25 గంటలకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్వాగతోపన్యాసం చేశారు.
- 11.30 గంటలకు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు.
- 11.50 గంటల వరకు ప్రభుత్వ పథకాలపై వీడియో ప్రసారం చేశారు.
- 11.50 నుంచి 12.40 గంటల వరకు సీఎం వైఎస్ జగన్ ప్రసంగించారు.
- 12.47 గంటలకు బస్సులో విమానాశ్రయానికి బయలుదేరారు.
- మధ్యాహ్నం 1 గంటకు శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకున్నారు.
- 3.20 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ముఖాముఖి అయ్యారు.
- 3.27 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు.



నడిపించే నేతకోసం: సభకు వచ్చిన దివ్యాంగుడు

సీఎం సభ సైడ్‌లైట్స్

- ఉదయం 8 గంటలకే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద జనసందడి మొదలైంది. ప్లకార్డులు చేత పట్టుకుని వేల సంఖ్యలో అభిమానులు సభాస్థలి చేరుకున్నారు.
- డప్పు వాయిద్యకళాకారులు సభాస్థలికి వచ్చే వారికి ఘన స్వాగతం పలికారు. మైదానంలో పలు ఆకారాల్లో ఏర్పాటు చేసిన బెలూన్లు, ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- సభావేదికపై జగన్ సంక్షేమ పాలనను వివరించే పాటలకు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.
- జనాలను అనుమతించిన అరగంటకే సభాప్రాంగణం మొత్తం నిండింది.
- సీఎం జగన్ సభాస్థలికి చేరుకోగానే 'జై జగన్' నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది. సంక్షేమ పథకాలను వివరిస్తూ సభలో వందల మంది పదే పదే ప్లకార్డులు ప్రదర్శించారు.
- సీఎం తన ప్రసంగంలో 'నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ' అన్న ప్రతిసారీ 'సీఎం సీఎం సీఎం' అంటూ జననినాదాలు మార్మోగాయి.
- వైఎస్ జగన్ బొమ్మ ఉన్న ఫేస్ మాస్కులు ధరించిన మహిళలు, చిన్నారులు, యువకులు ఉత్సాహంతో కనిపించారు.
- వై–జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా జగన్ పాలనలోని సంక్షేమ పథకాలను వివరించే ఫ్లెక్సీలు ఆకర్షణగా నిలిచాయి.



మేమంతా నీవెంటే: జగన్‌కు మద్దతుగా చేతులెత్తిన మహిళలు



అన్నా జగనన్నా: ఓ భవనం పైనుంచి సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు



జన కెరటం: బహిరంగ సభ ప్రాంగణం నిండిపోగా బయటే నిల్చున్న జనం

రైతుకు అండగా ప్రభుత్వం

అనంతపురం అర్బన్: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తూ అన్ని విధాల అండగా నిలుస్తోందని కలెక్టర్ గౌతమి అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ద్వారా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఈ పథకంలో ఐదో ఏడాది రెండో విడత కింద జిల్లాలో 2.94 లక్షల మంది రైతులకు రూ.120.17 కోట్లు మంజూరు చేసిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం రాష్ట్రస్థాయి కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై కంప్యూటర్ బటన్ నొక్కి రబీ సాయాన్ని రైతు ఖాతాల్లోకి జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతులతో కలిసి రైతు భరోసా మెగా చెక్కును కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీసీసీబీ జీఎం కె.సురేఖరాణి, జిల్లా సహకార అధికారి ప్రభాకర్‌రెడ్డి, రాప్తాడు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, తదితరులు

సంతోషంగా ఉన్నాం



రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా మంచి చేస్తోంది. ఆర్బీకేల ద్వారా అన్ని రకాల సేవలందిస్తోంది. ఈ ప్రభుత్వంలో రైతులందరూ చాలా సంతోషంగా ఉన్నారు. మాకు ఇంతలా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి.

– రైతు సి.వెంకటేశులు, తలుపూరు, ఆత్మకూరు మండలం

మద్దతు ధరతో చిరుధాన్యాల సేకరణ

- రైతులకు ఆదాయం.. పేదలకు ఆరోగ్యం
- పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు

అనంతపురం అర్బన్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగన్ సర్కార్ పాలన సాగిస్తోంది. ముఖ్యంగా రైతులు, పేదలకు ప్రయోజనం అందించడమే ఎజెండాగా ముందుకు వెళుతోంది. రైతులకు ఆర్థికంగా ఆదాయం కల్పించడం.. అదే క్రమంలో పేదల ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిరుధాన్యాలను మద్దతు ధరతో నేరుగా రైతుల నుంచి జిల్లా పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేయనుంది. ఇలా సేకరించిన చిరుధాన్యాలను కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో చిరుధాన్యాలను కొనుగోలు చేస్తారు. జొన్నలు క్వింటాలు రూ.3,180, రాగులు రూ.3,846, కొర్రలు రూ.2,500, కందులు రూ.7 వేల మద్దతు ధరతో పౌర సరఫరాల సంస్థ నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత కొనుగోలు చేసే స్వేచ్ఛను సంస్థకు ఇచ్చింది.

రైతులకు శ్రమ లేకుండా

చిరుధాన్యాలను విక్రయించే క్రమంలో రైతులకు ఎలాంటి వ్యయప్రయాసలు ఉండవు. రైతులకు శ్రమ లేకుండా వారి పొలాల (కల్లాల) వద్దకే పౌర సరఫరాల సంస్థ అధికారులు వెళ్లి పంటను కొనుగోలు చేస్తారు. రైతులకు పంట రవాణా సమస్య ఉండదు. అన్ని ఖర్చులూ ప్రభుత్వమే భరిస్తుంది.



ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్

కందులు, చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, జొన్నలు పండించిన రైతులు పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుని ఉండాలి. చిరుధాన్యాలను ప్రభుత్వానికి విక్రయించాలనే రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటేనే పౌర సరఫరాల సంస్థ చిరుధాన్యాలను కొనుగోలు చేస్తుంది.

కార్డుదారులకు పంపిణీ

జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన చిరుధాన్యాలు జొన్నలు, కొర్రలు, రాగులను బియ్యం కార్డుదారులకు పంపిణీ చేస్తారు. జిల్లాలో 6.50 లక్షలు కార్డుదారులు ఉన్నారు. కార్డుదారులు కోరిన మేరకు బియ్యం స్థానంలో ఒక కిలో నుంచి 3 కిలోల వరకు చిరుధాన్యాలు ఇస్తారు. ప్రస్తుతం రాగులు ఇస్తారు. రైతుల నుంచి చిరుధాన్యాలు సేకరించిన తరువాత వాటిని కార్డుదారులకు పంపిణీ చేస్తారు.



వైఎస్సార్‌సీపీ జెండాలతో సందడి చేస్తున్న యువత



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు



సీఎంకు చేతులెత్తి మొక్కుతున్న వృద్ధుడు



సీఎం వైఎస్ జగన్‌ను స్వాగతిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జననేతకు అపూర్వ స్వాగతం

అధికారం చేపట్టిన అనతి కాలంలోనే సంక్షేమ విప్లవంతో జన హృదయాలను గెలుచుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఆయన చేరుకునే సరికి రహదారులన్నీ పూల బాటలయ్యాయి. జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజలు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మారథం పట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అభిమానులు బహూకరించిన నాగలితో సీఎం వైఎస్ జగన్



శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం



మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



డీఐజీ అమ్మిరెడ్డి



అనంతపురం పార్లమెంట్ సభ్యుడు తలారి రంగయ్య



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) గురునాథరెడ్డి



తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్

దేవుడి ప్రేమ అపారం

- అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు రెవరెండ్ జాన్‌వెస్లీ

అనంతపురం కల్చరల్: దేవుడి ప్రేమ అపారమని, విశ్వాసంతోనే ఆయన్ను మనం చేరుకోగలమని అంతర్జాతీయ బైబిల్ ప్రసంగికులు రెవరెండ్ జాన్‌వెస్లీ అన్నారు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జాన్‌వెస్లీ మినిస్ట్రీస్ రాయలసీమ కో–ఆర్డినేటర్ జోయల్ గణేష్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే సువార్త స్వస్థత సభలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రెవరెండ్ జాన్ వెస్లీతో పాటు సిస్టర్ బ్లెస్సీవెస్లీ... దేవుని వాక్యం వినిపించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి తదితరులు మాట్లాడుతూ క్రీస్తు సేవలో తరిస్తున్న వెస్లీ దంపతులు అభినందనీయులని కొనియాడారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో సామూహిక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా కోయర్ బృందాల ఆలపించిన భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దైవజనులు టీపీ వరప్రసాదరెడ్డి, ఏపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సునీల్, నెహెమ్యా నాగరాజు, ఏపీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రెవరెండ్ జాన్‌వెస్లీ



సువార్త స్వస్థత సభలకు హాజరైన పట్టణ ప్రముఖులు, క్రైస్తవులు

సీఎంను సన్మానించిన పాత్రికేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న జర్నలిస్టుల ఇంటిస్థలాల కలను సాకారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి పర్యటనకు వచ్చిన సీఎంను పలువురు జర్నలిస్టులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. పాత్రికేయుల కుటుంబాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ ఆర్‌సీఆర్, సాక్షి టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి, ఎన్‌టీవీ ప్రతినిధి శ్రీనివాసులు, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పాత్రికేయులు

ఐచర్‌ను ఢీకొన్న ఓల్వో.. ఇద్దరి మృతి

గార్లదిన్నె: జాతీయ రహదారిపై ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఓల్వో బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నుంచి నిర్మాణ పనుల సామగ్రితో బయలుదేరిన ఐచర్ వాహనం మంగళవారం వేకువజామున గార్లదిన్నె మండలం కల్లూరుకు వద్దకు చేరుకుంది. 44వ జాతీయ రహదారిపై తరిమెల క్రాస్ వద్దకు చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద ఐచర్ డ్రైవర్ వాహన వేగాన్ని తగ్గించాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయలుదేరిన ఓల్వో బస్సు వేగాన్ని డ్రైవర్ నియంత్రించుకోలేక ఐచర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఘటనలో ఐచర్‌లో ప్రయాణిస్తున్న హైదరాబాద్ నివాసి రవికాంత్‌నాయక్ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పంజాబ్‌కు చెందిన సాహిల్ హర్షీద్‌ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతనూ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న గార్లదిన్నె పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నుజ్జునుజ్జైన ఓల్వో బస్సును పక్కకు లాగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఘటనపై ఏఎస్‌ఐ గురుమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



దెబ్బతిన్న ఓల్వో బస్సు

తల్లి, నలుగురు పిల్లలు అదృశ్యం



సువర్ణ, రాఘవేంద్ర, మోహన్



శంకరనారాయణ



మహాలక్ష్మి

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లికి చెందిన వివాహిత సువర్ణ మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో గొడవపడి తన నలుగురు పిల్లలు మహాలక్ష్మి, రాఘవేంద్ర, శంకరనారాయణ, మోహన్‌ను పిలుచుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో సువర్ణ తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 98826, 94913 08871కు ఫోన్ చేసి సమాచారం అందిచాలని కోరారు.

పెట్రోల్ తెచ్చుకుంటానంటూ బైక్‌తో పరారీ

కళ్యాణదుర్గం: పెట్రోల్ తెచ్చుకుంటానంటూ నమ్మించి ఓ దుండగుడు ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం గరుడాపురం నివాసి రమేష్‌ని మంగళవారం ఉదయం ఓ అపరిచిత వ్యక్తి కలసి బైక్ ఇస్తే పెట్రోల్ తెచ్చుకుంటానని, తన ద్విచక్ర వాహనం రోడ్డుపై నిలిచిపోయిందంటూ నమ్మబలికాడు. అయితే తన వాహనంలో పెట్రోల్ తక్కువగా ఉందని చెప్పినా వినకుండా బలవంతంగా రమేష్ నుంచి బైక్ (ఏపీ02 పీక్యూ 3113) తాళాలు ఇప్పించుకుని వెళ్లాడు. ఎంతసేపటికీ అజ్ఞాత వ్యక్తి తిరిగి రాకపోవడంతో రమేష్... పెట్రోల్ బంక్ వద్దకెళ్లి విచారించడంతో అసలు విషయం బయటపడింది. తన బైక్‌ను దుండగుడు అపహరించుకెళ్లినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించిన అనంత విద్యార్థులు

అనంతపురం: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వేదికగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ అండర్ –17 బాలికల పోటీల్లో జిల్లా జట్టు రన్నరప్‌ను దక్కించుకుంది. జట్టులో స్వాతి, హేమ, తపస్విని, పూజిత, వైష్ణవి, మధురిమ, శ్రీనిధి, హేమ, పూజిత కుమారి, శాంతి, రజిత, యమున, హైందవి, భాను, శృతి, దీప, లక్ష్మి, సంధ్య, సుకన్య, మేఘన అద్భుత ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే బాలుర జట్టులో మయాంక్, మహబూబ్ బాషా, అభిషేక్ ఏపీ జట్టులో చోటు దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సుగుణమ్మ, అంజన్న, జిల్లా కోఆర్డినేటర్ ఎల్. నాగరాజు తదితరులు అభినందించారు.

14 నుంచి హనుమద్ దీక్షలు

గుంతకల్లు రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి హనుమద్ దీక్షలు మొదలు కానున్నాయి. ఈ మేరకు కసాపురం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను ఆలయ అధికారులు, అర్చకులు, పాలక మండలి సభ్యులు మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 14న మండల దీక్ష మాల ధారణ, డిసెంబర్ 3న అర్ధమండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 23న ఇరుముడి కార్యక్రమం సందర్భంగా గుంతకల్లు నుంచి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం వరకూ మాలాధారులతో శోభాయాత్ర ఉంటుంది. డిసెంబర్ 24న హనుమద్ వ్రతంతో దీక్ష విరమణగావిస్తారు.

ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు మేయర్ వసీం తెలిపారు. మంగళవారం నగరంలోని ఆరో రోడ్డు ఆదర్శ స్కూల్, పాతూరులోని కస్తూరిబా స్కూల్‌లో జరిగిన వైద్య శిబిరాలను మేయర్ వసీం పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి మరింత పెద్దపీట వేశారన్నారు. తద్వారా ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయడానికి కాకుండా నూతన వైద్య కళాశాలలను తీసుకొచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, పార్టీ నేత అనంత చంద్రారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇషాక్, అనిల్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం



మన్నీలలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

కుమార్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, షెక్షావలి, సుబ్బయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అన్ని డివిజన్లకూ తాగునీరు ..

నగరంలోని అన్ని డివిజన్లకు తాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ తెలిపారు. బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర నగరపాలకోన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును పూర్తి స్థాయిలో నింపేందుకు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పీఏబీఆర్ మెయిన్ పైప్‌లైన్ నుంచి ప్రారంభించిన పనులను మేయర్ పరిశీలించారు.

విజయవంతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జిల్లాలో విజయవంతంగా సాగుతున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం మన్నీల, నగరంలోని రెండో రోడ్డులో హెల్త్ క్యాంపులను డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తనిఖీ చేశారు. 1,350 మంది ఓపీ సేవలు పొందారు. ఇందులో 300 మంది వైఎస్సార్ కంటి వెలుగు కింద చికిత్సలు చేయించుకున్నారు. నలుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

అందుబాటులోకి కంటి ఆపరేషన్ థియేటర్



జీజీహెచ్‌లో సిద్ధమైన పాత కంటి ఆపరేషన్ థియేటర్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని పాత కంటి ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఏడాది జూన్ 27న కంటి ఆపరేషన్ థియేటర్‌ను మూసి వేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చొరవతో ఇటీవల రూ.3.5 కోట్లతో ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు సాగాయి. ఈ నేపథ్యంలో కంటి ఆపరేషన్ థియేటర్‌నూ అన్ని విధాలుగా తీర్చిదిద్దారు. దీంతో మరో రెండ్రోజుల్లో శస్త్రచికిత్సలు ప్రారంభం కానున్నాయి.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు సనప విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: మండలంలోని సనప ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ నాగరాజు తెలిపారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో జరిగిన షూటింగ్ బాల్ సెలక్షన్‌లో అండర్ –19 విభాగంలో తరుణ్, అండర్ 17 విభాగంలో నందకిశోర్ అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం సుధా, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రభాకర్, రామ్మోహన్, మురళి తదితరులు అభినందించారు.

సామూహిక లలితా సహస్ర పారాయణం



చండీహోమం నిర్వహిస్తున్న శివయ్య స్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని శివకోటిలో భక్తిశ్రద్ధలతో సామూహిక వేద పారాయణం, వివిధ రకాల హోమాలు మంగళవారం నిర్వహించారు. ఐదురోజుల పాటు నిర్విరామంగా సాగనున్న మహా కుంభాభిషేక మహా సంప్రోక్షణ కార్యక్రమాలను రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. శివకోటి వ్యవస్థాపకుడు శివయ్యస్వామీజీ నేతృత్వంలో మంగళవారం ఉదయం, సాయంత్రం వేర్వేరుగా చతుర్వేద పారాయణ, సహస్ర చండీయాగ, మహారుద్ర యాగాలను జరిపించారు. వందలాది సంఖ్యలో మహిళలు సామూహిక లలితా సహస్ర పారాయణం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 11న మహాకుంభాభిషేకం, 12న పూర్ణాహుతి ఉంటుందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు మనోహర్

శింగనమల: పోతురాజు కాల్వ సమీపంలో అనంతపురం–తాడిపత్రి హైవేపై కూతలేరు బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ చితంబరం తెలిపిన వివరాలు.. అనంతపురం సాయినగర్‌కు చెందిన మనోహర్(39) కారు డ్రైవరుగా పని చేసేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. గతంలో రెండు ఆటోలు పెట్టి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో కూతలేరు బ్రిడ్జి దూలానికి ఉరేసుకున్నాడు. మనిషి బరువుకు తాడు తెగి కంపచెట్లలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆత్మకూరు ఎలక్షన్ ఇన్‌చార్జ్‌గా సనప గోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు మండల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా సనప గ్రామానికి చెందిన గంగుల గోపాల్‌రెడ్డిని ఎంపిక చేశారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాప్తాడు నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చి, రైతు సంక్షేమానికి కృషి చేశారన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటుతో మహిళలు, పాడి రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పచెప్పినందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి



తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాప్తాడు: కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, రాజన్న తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ సాల్మన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పెట్టుబడి కూడా రాలేదన్నారు. జిల్లాకు రూ.10 వేల కోట్ల కరువు ప్యాకేజీని ప్రకటించి, రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాలనాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



శ్రీనివాసనాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాలనాయక్ కుమారుడు శ్రీనివాస్‌నాయక్ (43) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. పి.యాలేరు సహకార సొసైటీ అధ్యక్షుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి మంగళవారం శ్రీనివాస్‌నాయక్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పంపనూరు తండాకు చేరుకొని బాలనాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శ్రీనివాస నాయక్ వైఎస్సార్ కడప జిల్లాలో డీఈగా పనిచేస్తుండేవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాప్తాడులో ఐటీ పార్కు ఏర్పాటు చేయండి

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడు వద్ద గాయత్రీ మిల్క్ డెయిరీకి కేటాయించిన 12 ఎకరాల భూమిలో ఐటీ పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు విన్నవించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి పర్యటనకు విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రైతులతో కలిసి ఆయన విన్నవించారు. రాప్తాడు పొలం సర్వే నంబర్ 274, 292, 294లో దాదాపుగా 45 ఎకరాలు పేదల భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి, పరిహారం అందిస్తామని ఏపీఐఐసీకి అప్పగించిందన్నారు. 2018లోనే 29 ఎకరాల భూమిని జాకీ పరిశ్రమ కోసం కేటాయించారన్నారు. అయితే జాకీ పరిశ్రమ పరిటాల కుటుంబానికి ముడుపులు చెల్లించలేక 2018లోనే వెనక్కు వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం ఏపీఐఐసీ ఆధీనంలోనే ఉందన్నారు. రాప్తాడు వద్ద ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని చెన్నేకొత్తపల్లి వద్ద 2021లో జరిగిన సభలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అభ్యర్థన మేరకు ప్రకటించారన్నారు. అప్పట్లో రాప్తాడుకు ఐటీ పార్కు వస్తుందని సంతోషపడ్డామన్నారు. అయితే అనివార్య కారణాల వల్ల జిల్లాకు చెందిన గాయిత్రి మిల్క్ డెయిరీకి 2023 జనవరిలో 274 సర్వే నంబర్‌లోని 11.92 ఎకరాల భూమి కేటాయించారన్నారు. గాయిత్రి డెయిరీ వల్ల కేవలం 400 మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుందన్నారు. అక్కడ ఐటీ పార్కు ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా మరో 10 వేల మంది యువతకు ఉపాధి దొరుకుతుందని విన్నవించారు. స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. ఈ విషయంపై పరిశీలించాలని అక్కడే ఉన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఆదేశించారన్నారు. గాయిత్రీ డెయిరీపై నివేదికను తయారు చేసి తనకు పంపాలని అధికారులను సీఎం ఆదేశించారని వైస్ ఎంపీపీ తెలిపారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు

సభకు తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు..

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన సభకు వేలాదిగా తరలివెళ్లారు. రాప్తాడు మండల నుంచి ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూర్ శేఖర్ ఆధ్వర్యంలో బస్సులు, పలు వాహనాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.







సీఎం వైఎస్ జగన్‌కి స్వాగతం పలుకుతున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ,ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదల సభకు మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం









డిప్యూటీ మేయర్ కోగటం , జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎస్వీ విద్యాసంస్థల అధినేత సోమశేఖర్‌రెడ్డి ,డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరగనున్నాయి. అంబేడ్కర్‌నగర్, రెండో రోడ్డు యూపీహెచ్‌సీకు సంబంధించి జీసస్‌నగర్‌లోని భాష్యం స్కూల్, రెండో రోడ్డు యూపీహెచ్‌సీలో శిబిరాలు ఏర్పాటు చేశారు.

మద్యం దుకాణంలో చోరీ

అనంతపురం క్రైం: స్థానిక గుత్తి రోడ్డులోని ఓ మద్యం దుకాణంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత దొంగలు చొరబడ్డారు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లిన సిబ్బంది చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. పైకప్పు రేకులను ధ్వంసం చేసి దుండగులు లోపలకు ప్రవేశించినట్లు గుర్తించారు. క్యాష్ బాక్స్‌లోని రూ.2 లక్షలకు పైగా నగదు, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. దుకాణ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: పిల్లలు విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనరల్ సర్జన్ డాక్టర్ కొండయ్య కోరారు. మంగళవారం అనంతపురం నగరంలోని నవోదయ కాలనీ గిరిజన గురుకుల పాఠశాలలో 'సైంటిఫిక్ టెంపర్ డే క్యాంపెన్ సదస్సు' ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ మూఢవిశ్వాసాలు లేని సమాజాన్ని నిర్మించుకోవడానికి నేటితరం ముందుండాలన్నారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో మొదటి నోబెల్ బహుమతి, భారతరత్న అందుకున్న వ్యక్తి సర్ సీవీ రామన్ అని గుర్తు చేశారు. మానవుడి ప్రగతి శాస్త్ర వి/్ఞానఅభివృద్ధిలో కనిపిస్తుందన్నారు. పాలకులు శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన మాట్లాడుతూ ఇదేరోజున మేడం క్యూరి జన్మించిందని గుర్తు చేశారు. ఎన్నో అడ్డంకులు దాటుకొని ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండింటిలో నోబెల్ బహుమతి అందుకున్న మొదటి మహిళ అన్నారు. యాంటీ సైన్స్, సూడో సైన్స్ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ అర్జున్ నాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమలో జేవీవీ నగర నాయకులు విజయలక్ష్మి, గాంగే నాయక్, రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణభారత అంతర వర్సిటీ కబడ్డీ పోటీలకు ఎస్కేయూ జట్టు

అనంతపురం: ఈ నెల 9న జేఎన్‌టీయూ (కాకినాడ)లో ప్రారంభమయ్యే దక్షిణ భారత అంతర వర్సిటీ కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిలో ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన ఎస్.ఖాజాహుస్సేన్, ఆర్.రాజశేఖర్, సి.గంగశేఖర్, పి.ప్రసాద్, ఎన్.యుగంధర్, పి.నరసింహుడు, హెచ్.మహేష్, కె.నాగశేఖర రెడ్డి, ఎం.మధు, వి.జమ్మన్న, టి.జగదీష్, ఎస్.కపిల్‌దేవ్ ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈ సందర్భంగా వర్సిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, టీమ్ మేనేజర్ జి.ప్రసాద్, కోచ్ ఎన్.అనిల్‌కుమార్ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని కమేళా వీధిలో నివాసముండే ప్రైవేట్ బస్సు డ్రై వర్ హుస్సేన్ బాషా మంగళవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. కుటుంబ కలహాలతోనే హుస్సేన్ బాషా ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ చైర్మన్ రమేష్ నాయుడు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోందన్నారు. కేన్సర్‌లో ముందస్తు రోగ నిర్ధారణ, తక్షణ వైద్య సంరక్షణ చాలా ముఖ్యమైనదన్నారు. ప్రారంభ దశలో రోగ నిర్ధారణ చేసినప్పుడు, చికిత్స సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురేంద్ర నాయుడు, మహిళా సాధికారిత కన్వీనర్ డాక్టర్ మాధవి, నీరజ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఖలీల్ బాషా, ప్రత్యూష, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

- రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: రైతుల అభివృద్ధే లక్ష్యంగా రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పని చేస్తోందని చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం కార్యాలయంలో రైతులు, పీఏసీఎస్ సిబ్బందికి 'ఘర్ ఘర్ కేసీసీ అభియాన్' పథకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీసీసీ మొదటి రోడ్డు బ్రాంచ్ మేనేజర్ సుజాత, పీఏ సీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి మాట్లాడారు. ప్రతి సభ్యుడూ కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బి.ఆదినారాయణ, సీఈఓ ఆర్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గార్లదిన్నె: విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కల్లూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శారదాభాయి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 1న కాకినాడలో జిమ్నాస్టిక్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నలుగురు విద్యార్థులు పిరదౌసి, విష్ణు, సాయిహర్షిత్, నందిని అండర్- 14, అండర్–17 విభాగంలో ప్రతిభ కనభరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎంతోపాటు పీడీలు రామప్రసాద్, నారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పుట్టపర్తికి భారీగా తరలిన రైతులు

కనగానపల్లి: వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ కోసం మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో రైతన్నలు తరలివెళ్లారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున తరలివెళ్లారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ప్రజలంతా స్వచ్ఛందంగా అక్కడికి సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించినట్లు రైతులు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: స్థానిక డ్యాం రోడ్డు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన దాడి కేసులో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ గురుమూర్తి తెలిపిన వివరాలు.. మంజునాథ్ అనే వ్యక్తి బిగ్ బాస్కెట్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేసే శివలింగయ్యను కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. ఇందుకు మంజునాథ్ కారణమని భావించిన శివలింగయ్య మరికొంతమందితో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

కుక్కకాటు బాధితుడికి మెరుగైన వైద్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పేదలకు ఖరీదైన, నాణ్యమైన వైద్యం అందుతోంది. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన హరి కుమారుడు లక్కీ అనే చిన్నారిపై ఈ నెల2న కుక్క దాడి చేసింది. ఈ క్రమంలో చిన్నారి కుడి చెంప, కంటి పై భాగంలో తీవ్ర గాయమైంది. చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీ నుంచి వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఈనెల 3న అనంతపురం సర్వజనాస్పత్రికి పంపారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలోని వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. రేబిస్ ఇమినోగ్లోబిలిన్, తదితర మందులు అందించి, మెరుగైన వైద్యం అందించారు. లక్కీ కోలుకోవడంతో యూనిట్ – 2కు మార్చి, మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇలాంటి వైద్య చికిత్సలు పొందాలంటే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. అలాంటిది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా ఖరీదైన వైద్యం అందింది.



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్న పిల్లల విభాగంలో డిశ్చార్జ్ అయిన సీకే పల్లికి చెందిన లక్కీ

జేఎన్‌టీయూ పీజీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో నిర్వహించిన ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్/సప్లిమెంటరీ , మూడో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు రెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ అనంతపురం అధికారిక వెబ్‌సైట్ https://jntuaresults.ac.in/ లో అందుబాటులో ఉంచారు.

నెట్టికంటి ఆలయ సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈఓ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సమితి సభ్యులు ఈఓతో మాట్లాడుతూ భక్తులకు సరైన సౌకర్యాలు లేవని, ఆలయంలో పనివిధానం సక్రమంగా లేదని, పాలక మండలి సభ్యుల సూచనలను అధికారులు సరిగా పట్టించుకోవడం లేదన్నారు. అసాంఘిక చర్యలకు ఆలయ, పరిసరాల్లో గానీ ఆస్కారం లేకుండా చేయాలని కోరారు.